దేశభక్తి

రచన - శ్రీ అరుమల్లి విశ్వనాథరావు.

వ్రేయిలు రావటానికి పావుగంట మాత్రమే వ్యవధి ఉన్నది. ప్లాట్ ఫారమంతా ఇసుక వేస్తేరాలకుండా జన సమూహంచేత కిటకిట లాడుతున్నది. బండిరావటానికి సిగ్నల్ కూడా అయింది. నెలకు రెండువేలు సంపాదించే ప్రాక్టీసును ప్రజా సేవకై విరమించి, లక్షలాది ఆస్థిని దేశసేవలో కోల్పోయి బికారై, యీనాడు భార్యా బిడ్డల్ని పోషించటానికి చిల్లిగవ్వకూడా లేని పరిస్థితిలో కాంగ్రెసు నియమావళి తూ. చ. తప్పక మహాత్ముని ఆదేశమును శిరసావహించి సత్యాగ్రహోద్యమంలో అరెష్టుకాబడి మూడు సంవత్సరాలు కఠినశిక్ష విధించబడ్డ మాధవరావుగారు జైలు జీవితాన్ని అనుభవించటానికి వెడుతున్నరోజది. పూల దండలు వేస్తున్నవారు, అభివందనాలు తెల్పేవారూ, ఆయన అకుంఠితత్యాగాలను శ్లాఘించేవారూ, రకరకాల ప్రజలతో కన్నుల పండువగా ఉన్నది. స్టేషన్‌లో పురుషులేకాకుండా అనేకమంది స్త్రీలుకూడా హాజరయ్యారు.

"అటువంటి భర్తను పొందిన శాంతమ్మదమ్మా అదృష్టం." అన్నదొక సుబ్బమ్మగారు.

"అవునమ్మా వొదినగారూ! గాంధీగారికి కూడ ఈయనంటే ఎంతో ప్రేమట, విన్నావా?" అంటూ బలపర్చింది. ఇంకొక వెంకాయమ్మ.

"ఎందుకొచ్చిన అదృష్టమమ్మా! ఆ శాంతమ్మ కొల్లో ఒక్క నల్లపూసైనా లేదు గదా? ఉన్న ఆస్థంతా ఇందులో తగలడిందిగదా! నిక్షేపంలాంటి ప్లీడరీకి నీళ్లువదిలాడుగదా! ఎందుకొచ్చిన ఆర్భాటమిదంతా? కూటికా గూరకా? ఇన్ని అవస్థలుపడుతూ దరిద్రం వెళ్లబోస్తోంటే ఆ గాంధీగారే మనుకా కాస్త కనిపెట్టాడూ?"

అంటూ దీర్ఘ ఉపన్యాసం ప్రారంభించింది. ఒక ప్లీడరుగారి విధవ అప్పగారు.

ఇక పదినిమిషాలులో మెయిలు వస్తుంది భర్తను మళ్లీ తిరిగి ఎన్నాళ్లకో కల్సుకోవటం అనే దిగులు ఒకవైపూ, ముగ్గురు పిల్లలతో యే ఆధారమూ లేక సంసారంలో యెట్లా కాలక్షేపం చెయ్యాలో అన్న దిగులు మరొకవైపు దీర్ఘసమస్యలై కూర్చోగా భర్తవైపు అట్టే చూస్తూ ఆలోచిస్తోంది శాంత. నాన్నగారు అరెష్టయి జెయిలుకు వెడుతున్నారు, మరి మూడుసంవత్సరాలు పరకూ కన్పించరు, అని తెల్సుకొన్న పదునాలుగేండ్లు లక్ష్మి బిక్కమొహం వేశింది. నాన్నగారిలా పూలదండలు వేయించుకుని రైలెక్కి జైలుకు నే నెప్పుడు వెడతానని కాబోలు అతి వుత్సాహంతో జాతీయ పతాకం చేతపుచ్చుకుని తోటి విద్యార్థులమధ్య జాతీయ నినాదాలిస్తున్నాడు కృష్ణ—మాధవరావుగారి పన్నెండేండ్ల కుమార్డు. తల్లిచంకనుండి తనచిరునవ్వులు అందరికీ సమానంగా పంచియిస్తోంది రెండేండ్ల అరుణ.

నవ్వుమొహంతో భార్యవద్దకువచ్చి అరుణను అందుకుని ఒకసారి ముద్దాడి శాంత మొహంలోనికి చూశాడు. ఆమెముహంలో, ఆ కళ్ళల్లో విచార రేఖలు స్పష్టంగా కన్పిస్తోన్నయ్!

"శాంతా! ఎందుకే అట్లా ఉన్నావ్?"

ఆమె మాట్లాడలేదు.

"చెప్పు! ఎన్నిసార్లు నీవు ఆనందంతో నన్ను పంపలేదు. ఈ దఫా కొత్తగా ఉన్నదా?"

"నిజమే కొత్తకాదు."

"మరి? చెప్పు! ఎందుకా విచారం?"

"ఏంటి చెప్పను? మీకు తెలియనిదా? మూడు సంవత్సరాలు మీ ఎడబాటు, ఎట్లా ఓర్చుకోగలను? యీ సంసారం....."

"నిజమే మరి! కాని దేశమో? ఏది ముఖ్యము?

"ఆలోచించండి!"

"దేశమే శాంతా! ఏనాడు భారతావని సర్వ స్వతంత్ర అవుతుందో ఆనాటివరకూ, మనకీ కష్టాలూ యీ ఎడబాట్లు తప్పవ్!"

బండి వచ్చేసింది.

"శాంతా మరి వెళతాను."

"వచ్చేటప్పుడు స్వాతంత్ర్యాన్ని వెంట పెట్టుకు రండి!"

అకస్మాత్తుగా ఆమె పెదవులపై చిరునవ్వు తాండవించింది.

* * *

కృష్ణుడు పుస్తకాలతో ఏడుస్తూ తిరిగి ఇంటికి వచ్చాడు. శాంత బిందెతో పంపుకువెళ్లి ఇంకను రాలేదు. ఏడుస్తున్న అరుణను చంకనెత్తుకు పచారు చేస్తున్న లక్ష్మి కృష్ణున్ని చూసి బిత్తరపోయింది.

పుస్తకాలు బల్లమీదికి విసిరేసి ఏడుస్తూ కూర్చున్నాడు.

"ఏరా తమ్ముడా! ఏం జరిగింది? ఎవరు కొట్టారు?"

ఆప్యాయంగా ప్రశ్నించింది. వాడు ఏడవడం తప్ప మాట్లాడడు.

"ఒరేవ్! నిన్నే అడిగేది. మొద్దులా ఎందు కేడుస్తావ్? బల్లోంచి అప్పుడే వచ్చావేం?"

"ఆవెదవ బల్లోకి నేనిక వెళ్లను, నాన్న గారు వచ్చాక వీళ్లందరి పనిపట్టిస్తాను."

"అసలు యేం జరిగింది?"

చీర చెరగుతో వాడి కళ్లనీళ్లు తుడుస్తూ ప్రశ్నించింది.

"జీతం కట్టలేదని పేరుతీసేసి పొమ్మన్నాడు ఇంగ్లీషు మాస్టరు."

అప్పుడే వచ్చిన శాంత, యీవిషయం విని,

"పోనీలే నాయనా! నువ్వింటివద్దనే చదువు కుందూగాని, యేం?"

ఆరాత్రి లక్ష్మి తమ్ముణ్ని పక్కలో పరుండ బెట్టుకుని ఝాన్సి లక్ష్మిభాయి కథను ముద్దుముద్దు గా వ్యాఖ్యానించి చెబుతోంది. శాంత అరుణను నిద్రపుచ్చి దీపంవద్ద కలం సిరాబుడ్డి తీసుకుని భర్తకు లేఖను ప్రారంభించింది.

"ప్రియమయిన.....

మీశాంత నమస్కారములుచేసి వ్రాయునది.

మీక్షేమం తెలిసి ఆనందించాం. లక్ష్మి కృష్ణుడు, మీముద్దుల అరుణ కులాసాగా ఉన్నారు. కృష్ణుడు స్కూలుకు పోవటంలేదు...కాదు...కాదు ...వాళ్లే రానివ్వటంలేదు. ఎందుకో తెలుసా? నే నెట్లారాశేది.....వాడి స్కూలు జీతం కట్టేందు కూడ దిక్కులేని పరిస్థితికి...సిగ్గుపడుతున్నాను... ఇందుకై ఎవర్ని ఆశించను? ఎవరిస్తారు? ఎవరిక్కా వాలి? ప్రభుత్వ ఉద్యోగాల్లో ములిగి తేల్తూ డబ్బు సంపాదనే ప్రధాన ఆశయంగా గల బావగారు వగయిరా ఆత్మ సంబంధీకులుకూడ కనీసం మన పిల్లల క్షేమం తెల్సుకొందుకు అధమం నెలకు ఒక్క సారయినా మనవైపు తేరి పారచూట్టంలేదు. ధన మున్న రోజుల్లో మనింట్లో అనేక దఫాలు టీపార్టీలూ విందులూ ఆరగించిన మీ మిత్రుల్లో ఒక్కరు కూడ యీనాడు పల్కరించటానికయిన రావటం లేదు. యీచిత్ర పరివర్తనానికి కారణం యీనాటి మన కుటుంబ పరిస్థితులేననుకుంటాను. ఇప్పటికే ఆలస్యమయిన అమ్మాయి వివాహం ఇకనయినా చేసేందుకు కించిత్ ప్రయత్నమయినా లేకపోవటం మూలాన్ని కావలసినవారూ, అక్కర్లేనివారూ అను కుంటున్న మాటలు వింటున్న నాచెవులు గట్లు పడు తున్నై...మీ కమ్యూనిష్టు సోదరుడు కామ్రేడ్ సుందరం మన గురించి పని పెట్టుకుచేస్తున్న దుష్ప్ర చారం... నేను మీకేమని రాయగలను? ఆప్రచారం

విన్నవాళ్లు చెబుతోంటే ఆత్మహత్య చేసుకోవాలని పిస్తోంది. ఇవన్నీ రాసి... మీశాంతికి భంగం గల్గిస్తున్నాను కాబోలు... కాని రాయకుండా యీ గుబులునంతా నేనెట్లాగ భరించగలను... చెప్పండీ! మీవంటి దేశభక్తుని ఇల్లాలునైనందుకు ఆనందించినాకి లేక పసిపిల్లల్నికూడ ఒక్కొపూట పస్తుపడుకోబెడుతున్నందుకు విచారించనాకి వస్తే ఏమయినా ఇవ్వాల్సి వస్తుందని కాబోలు యీమధ్య మానాన్న కూడ రావటం విరమించుకున్నాడు. బి. ఏ. బి. యల్ గారి భార్యను, కాంగ్రెస్ నాయకుని ఇల్లాలిని, నాఅంతట నేను, ఎంత తండ్రి అయినా, ఇతరుల సహాయం అర్థించటం నాకే లజ్జాకరంగా తోచింది. ఇందుకు మీరు మాత్రం హర్షిస్తారాకి చెప్పండి! ఇన్ని గొడవల్లో ముఖ్యమయిన యీలేమి ఎంత దుర్భరంగా ఉన్నదో! ఉంటున్నదో విద్యావంతులయిన మీకు వేరే అర్థం చెయ్యాలాకి నేనిక రాయలేను... ఒక్క విషయం... బాకీ పడిన రెండు మాసాల అద్దిగురించి ఇంటివాడు చేస్తున్న హడావిడి—దొరికిపోయినదొంగపై పోలీసులు వారి చర్యకంటె మితి మీరింది. ఆయన దుర్భాషలు వింటే ఇల్లు కాళీచేయాలని ఉంది. కాని తర్వాత ఏ చెట్టు నీడ? యీవిషయాలన్నీ రాయకూడదని అనుకున్నప్పటికి వాటంతట అవే వస్తున్నవి, ఇక రాయలేను. రాసి మీహృదయానికి బాధ కల్గించలేను. మీ క్షేమానికై ఆతృతపడే, మీ శాంత''

ఇదే లేఖకు అతని జవాబు నాలుగు మాటలు.

"ప్రియమయిన శాంతకు,

చేరింది. సంగతులు అర్థమయినవి. ఏం చేస్తాం? లేమిని అనుభవించటానికి మనకిది మంచి తరుణం. కాలానికి కట్టుబడి ఓర్పు వహించటం నేర్చుకో. అరుణకు నా ముద్దులు.

నీ మాధవ''

ప్రజానాయకుడు శ్రీ మాధవరావుగారి విడుదలను దినపత్రికలన్నీ ఒకేసారిగా ప్రకటించినై. ఆనాటి మెయిలులో మాధవరావు బయలుదేరాడు. మెయిలు ఆగిన ప్రతి స్టేషనులోనూ, ప్రజలు జయజయ ధ్వానాలతో పూలదండలతో అలంకరించి సుస్వాగత మిచ్చారు. ప్రతీ స్టేషనులోనూ వేల సంఖ్యలో ధనరూపముగా కాన్కలు సమర్పించబడినవి. కాన్కను సమర్పించే ప్రతివ్యక్తీ ప్రత్యేకంగా మాధవరావు నుద్దేశించి.

"దేశసేవలో యిరువది సంవత్సరాలుగా పాటుపడుతూ లక్షలాది ఆస్తిని కోల్పోయి, ప్రజాసేవయే, స్వాతంత్ర సంపాదనే, ప్రథమ లక్ష్యంగా భావించి, బికారులై ఎనలేని ఆగచాట్లకు గురియైన మీ కుటుంబ ఖర్చులకై, మీ ఉపయోగము కొరకు, యీ స్వల్పం స్వీకరించాల్సిందిగా ప్రార్థిస్తున్నాం.''

మాధవరావు చిరునవ్వుతో తనయందు ప్రజలకుగల అభిమానానికి ముగ్ధుడై స్వీకరించాడు.

శాంత... నీరసించి పోయిన శాంత... కృంగి కృసించిపోయిన శాంత... గుర్తుపట్టటానికి వీలులేనంతగా మారిపోయిన పిల్లలతో స్టేషన్ వద్ద భర్తకు స్వాగతమిచ్చింది. సాయంకాలం ఆరుగంటలకు నెహ్రూపార్కులో బహిరంగ సభ యేర్పాటు చేయబడింది.

రాబోతున్న ఎన్నికల్లో మీమీ ప్రతి ఒక్క వోటూ అరవై సంవత్సరాలుగా దేశ స్వాతంత్ర్యానికై పోరాడుతున్న కాంగ్రెసుకే ఇచ్చి బలపర్చగలందులకు కోరుతున్నాను. బానిసత్వాన్ని బలపరుస్తూ ప్రభుత్వానికి మద్దత్తు కలిగిస్తున్న ప్రతిఘాతశక్తులకు తగిన గుణపాఠం చెప్పటానికి యిది తగిన సమయం. అంటూ ఉద్ఘాటించాడు మాధవరావు.

సాయంకాలం పడిపోయింది. నగరమంతటా విద్యుద్దీపములు తళతళలాడుతూ ప్రకాశిస్తున్నయ్. ఈమధ్యనే కొత్తగా కాంగ్రెసులో చేరి ఆనాటి

సభకు అధ్యక్షత వహించిన జమిందార్ విజయ కుమార్ గారి కారు మాధవరావును భార్యాపిల్లల్తో ఇంటివద్ద దింపేసి పోయింది. ఇల్లు అయ్యవార్లంగారి నట్టిల్లులా ఒకదానికొకటి లేదు. లాల్చీ జేబులు రెండూ, ఇన్నివేలు నోట్లు చెక్కులను అంతవరకూ మోసినా ఒక్క అణా ఇంటికివచ్చేవరకూ నిల్పటానికి నోచుకోలేదు. అన్నీ హరిజనులకే సమర్పించాడు. తన ముఖంలోకి దీనంగా చూస్తున్న శాంతను వీక్షిస్తూ చిరునవ్వుతో పిల్లల్ని ఆప్యాయంగా దగ్గరకు తీసుకున్నాడు.

తండ్రి:—(పేపరు చదువుకొంటూ విసుగ్గా) "ఛీ! వెధవా! నోరుముయ్యి"

కొడుకు:—"కొడతావేమోఁ?"

తండ్రి:—"ఎందుకురా, వెధవాఁ?"

కొడుకు:—"నీ నోరు మూస్తే."

యస్. నవీనకృష్ణ, పిఠాపురం.

శృంగారం

ఇది చక్కని శృంగారరసం తొణికిసలాడే పదకొండు కథల సంపుటి. ఇందులో శ్రీయుతులు మంత్రిప్రగడ వెంకటరమణరావు, నూరిశెట్టి సాంబ శివరావు బాబ్జీ, కొత్తపల్లి సుబ్రహ్మణ్యం, కిరణ్, ఆకొండ రామకృష్ణ, మధునాపంతుల, పి. శ్రీరాములు, నందకుమార్, వెల్లంకి రామకృష్ణరావుగార్ల కథలు ఉన్నాయి. పాఠకలోకానికి తమ రచనలతో చిరపరిచితులైన ఈ కథకులు "శృంగారం" లో పేరుకుతగిన రచనలను సాగించారు. ఇలాంటి వివిధ కథకుల రచనలను సంపుటిగా ప్రతీసెలా ప్రచురించడం ఒక కొత్తపంథాయే ఔతుంది.

"శృంగారం" వెల 8 అణాలే. ప్రతులు కావలసినవారు పడోసీ కార్యాలయం, పుంగనూరు, చిత్తూరు జిల్లా, అని వ్రాయండి.

శ్రీరామజయం.

బహుకాలమునుంచి ఆంధ్రాలోప్రఖ్యాతిగాంచిన మాయొక్క కలరునూలునే కొనుడీ!

యెల్లప్పుడున్ను మావద్ద అన్ని నెంబరులలో పలువిధములయిన రంగులలో దొరకును. మాయొక్క చిరునామాను జ్ఞప్తివుంచగలరు.

టి. కె. వి. యస్. విద్యాపూర్ణాచారి,

[నవీన గ్యారంటీ రంగునూలు వ్యాపారము,]

42, మాహాలు, 2 వ వీధి, మధుర (S. I. Ry.)

Telephone: 183.

T. K. V. S. VIDYAPOORNACHARY,

[Grey & Fast Coloured Yarn Merchant,]

43, Mahal 2nd Street, : : MADURA (S. I. R.)